కరీంనగర్‌లో 'నమస్తే' ప్రాపర్టీషో

మాజీ ఎంపీ వినోద్‌కుమార్ చేతుల మీదుగా ప్రారంభం

భారీగా తరలివచ్చిన ప్రజలు.. తొలి రోజే గ్రాండ్ సక్సెస్

కరీంనగర్‌లోని రెవెన్యూ గార్డెన్‌లో నిర్వహించిన ప్రాపర్టీషోలో జ్యోతిప్రజ్వలన చేస్తున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్, నాఫ్స్‌కాఫ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, మేయర్ సునీల్‌రావు, నమస్తే తెలంగాణ అడ్వర్టైజ్‌మెంట్ జనరల్ మేనేజర్ ఎన్ సురేందర్ రావు

ప్రాపర్టీషోలో ఏర్పాటు చేసిన స్టాల్స్ నుంచి వివరాలను తెలుసుకుంటున్న ప్రజలు

కరీంనగర్ కార్పొరేషన్, ఫిబ్రవరి 9: ప్రజల సొంతింటి కలను సాకారం చేసేందుకు తరచుగా స్థిరాస్తి ప్రదర్శనలు నిర్వహిస్తున్న 'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టుడే' పత్రికలు తాజాగా మరో ప్రాపర్టీ షోకు తెర లేపాయి. కరీంనగర్‌లోని కలెక్టరేట్‌కు ఎదురుగా రెవెన్యూ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఈ ప్రాపర్టీ షోను మాజీ ఎంపీ వినోద్‌కుమార్, నాఫ్స్‌కాఫ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, కరీంనగర్ మేయర్ యాదగిరి సునీల్‌రావు శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన పలు ప్రముఖ సంస్థల తోపాటు జిల్లాకు చెందిన వివిధ రియల్ ఎస్టేట్ సంస్థలు, బిల్డర్లు, బ్యాంకర్లు, సోలార్ సంస్థలు ఈ ప్రదర్శనలో స్టాళ్లను ఏర్పాటు చేశాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో ఈ స్టాళ్లను సందర్శించి వివిధ రియల్ ఎస్టేట్ సంస్థల వెంచర్లు, ఇండ్లు, స్థలాలతోపాటు వాటి కొనుగోలుకు బ్యాంకులు కల్పిస్తున్న రుణ సదుపాయాల గురించి తెలుసుకున్నారు. దీంతో తొలి రోజే ఈ ప్రాపర్టీషో గ్రాండ్ సక్సెస్ అయ్యింది. కార్యక్రమంలో కేడీసీసీబీ ఉపాధ్యక్షుడు పింగళి రమేశ్, 'నమస్తే తెలంగాణ' అడ్వర్టైజ్‌మెంట్ జీఎం ఎన్ సురేందర్‌రావు, ఏజీఎం రాజిరెడ్డి, కరీంనగర్ బ్రాంచి మేనేజర్, బ్యూరో ఇన్‌చార్జి కే ప్రకాశ్‌రావు, యాడ్స్ మేనేజర్ రేణ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ కంపెనీలన్నీ ఒకే వేదికపైకి

స్థిరాస్తి కొనుగోలుదారుల సౌలభ్యం కోసం 'నమస్తే తెలంగాణ, 'తెలంగాణ టుడే' ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రాపర్టీషోలను నిర్వహిస్తున్నాం. గతంలో విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీలు హైదరాబాద్ లాంటి నగరాలకే పరిమితమయ్యేవి. ప్రస్తుతం ప్రజల అభిరుచులు మారడంతో జిల్లా స్థాయిలోనూ అత్యాధునిక సౌకర్యాలతో కూడిన విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీలపై ఆసక్తి చూపుతున్నారు. వారి సౌలభ్యం కోసం పలు ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలతోపాటు నిర్మాణ రంగానికి సంబంధించిన వివిధ కంపెనీలు, బ్యాంకర్లను ఒకే వేదికపైకి తీసుకొచ్చి ఈ ప్రాపర్టీషోను ఏర్పాటు చేశాం. దీనిని జిల్లా ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం.

- ఎన్ సురేందర్ రావు, నమస్తే తెలంగాణ అడ్వర్టైజ్‌మెంట్ జనరల్ మేనేజర్

లోకం పోకడ



డయాబెటిక్ విద్యార్థులు పరీక్ష కేంద్రానికి పండ్లు తెచ్చుకోవచ్చు: సీబీఎస్ఈ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: సీబీఎస్ఈ బోర్డు పరీక్షలు రాసే డయాబెటిక్ విద్యార్థులు పరీక్ష కేంద్రానికి తమ వెంట పండ్లు, నీళ్ల బాటిల్, గ్లూకోమీటర్ తీసుకెళ్లవచ్చు. ఈ మేరకు బోర్డు వెసులుబాటు కల్పించింది. త్వరలో సీబీఎస్ఈ 10, 12వ తరగతి పరీక్షలు ప్రారంభంకానున్న నేపథ్యంలో బోర్డు కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. వీటి ప్రకారం డయాబెటిక్ విద్యార్థులు తొలుత పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అది కూడా పాఠశాల ద్వారా దరఖాస్తు చేసుకొని సంబంధిత పత్రాలను సమర్పించాలి. తర్వాత పరీక్షలు ప్రారంభానికి ఒకరోజు ముందు పరీక్ష కేంద్రానికి వెళ్లి డయాబెటిక్ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. దీంతో అధికారులు కూడా ఏర్పాట్లు చేసుకుంటారు.

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	12.2°c	29.8°c
రంగారెడ్డి	15.8°c	37.1°c
మెదక్	15.9°c	34.8°c
నిజామాబాద్	18.5°c	31.1°c
హైదరాబాద్	20.9°c	33.5°c
నల్లగొండ	21.2°c	34.7°c
మహబూబ్‌నగర్	22.6°c	35.0°c
ఖమ్మం	23.0°c	34.0°c
కరీంనగర్	23.0°c	32.0°c
వరంగల్	23.0°c	32.0°c

ఫిరాయింపు నేతలు ప్రజాతీర్పు కోరాల్సిందే

మూడోపేజీ తరువాయి...

ఫిరాయింపు కేసులో జస్టిస్ పీవీ కున్హికృష్ణన్ ఈ నెల 5న ఈ తీర్పును వెలువరించారు. ఓ ప్రజాప్రతినిధి తన నియోజకవర్గ ప్రజల గొంతుకగా ఉండాలని న్యాయమూర్తి పేర్కొన్నారు. ఆ ప్రజాప్రతినిధి ఓటర్ల అభీష్టానికి వ్యతిరేకంగా, తన ఇష్టానుసారంగా వ్యవహరించకూడదని అన్నారు. 'ఓ రాజకీయ పార్టీ లేదా కూటమి నుంచి ఎన్నికైన ప్రతినిధి తన పదవీకాలం పూర్తయ్యేవరకు ఆ పార్టీని లేదా కూటమిని విడిచిపెట్టకూడదు. ఓ రాజకీయ పార్టీ అభ్యర్థిగా ఉన్నందునే వారిని ప్రజలు ఎన్నుకున్నారు కాబట్టి.. ఆ అభ్యర్థి తన ఇష్టానుసారంగా వ్యవహరించకూడదు' అని వ్యాఖ్యానించారు. ఏ రాజకీయ పార్టీ మద్దతు లేకుండా స్వతంత్రంగా ఎన్నికైతే.. ఆ అభ్యర్థి ప్రజల అభీష్టం ప్రకారం నడుచుకోవాలని పేర్కొన్నారు. ఓ పార్టీ అభ్యర్థిగా ఎన్నికైన వారు ఆయా మండళ్లు లేదా సంస్థలు, సభల్లో తమను ఎన్నుకున్న ప్రజల ఉద్దేశాలను వెల్లడించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆంగ్ల క్యాథలిక్ చరిత్రకారుడు, రాజకీయవేత్త, రచయిత లార్డ్ యాక్టన్ చెప్పిన మాటలను ప్రస్తావిస్తూ.. 'అధికారం అవినీతికి పాల్పడేలా చేస్తుంది.. సంపూర్ణ అధికారం అవినీతిలో పూర్తిగా ముంచేస్తుంది' అన్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఈ మాటలను గుర్తుంచుకోవాలని చెప్పారు. ఎన్నికైన సభ్యుడు మరోసారి ఓటర్ల తీర్పు కోరేంత వరకు తనను ఎన్నుకున్న ప్రజల అభీష్టాన్ని వ్యక్తపరచాలన్నది ఫిరాయింపుల నిరోధక చట్టం ఉద్దేశమని గుర్తు చేశారు.

పబ్లిక్ ఎగ్జామ్స్ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం

న్యూఢిల్లీ: పోటీ పరీక్షల్లో అవకతవకలను అరికట్టేందుకు రూపొందించిన బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. ఈ నెల 6నే ఈ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలుపగా.. తాజాగా శుక్రవారం రాజ్యసభ ఆమోదించింది. పరీక్షల్లో అక్రమాలకు పాల్పడిన వారికి గరిష్ఠంగా పదేండ్ల జైలు, కోటి రూపాయల దాకా జరిమానా విధించేలా ఈ బిల్లు రూపొందించారు. రాజ్యసభలో ఈ బిల్లుకు కొందరు ప్రతిపక్ష సభ్యులు సూచించిన సవరణలు తిరస్కరణకు గురయ్యాయి. అనంతరం బిల్లు ఆమోదం పొందింది.

చెదురుతున్న అమెరికా కల!

- పెరిగిన ట్యూషన్ ఫీజులు, ఉద్యోగాల కొరత
- తక్కువ వేతనాలు.. హెచ్-1బీపై సందిగ్ధత
- యూఎస్ రాకపై పునరాలోచించుకోండి
- ఔత్సాహిక భారతీయ విద్యార్థులకు అమెరికాలోని భారతీయుల సూచన

న్యూయార్క్, ఫిబ్రవరి 9: అమెరికాలో ఉన్నత విద్య.. ఆ తర్వాత మంచి జీతంతో ఉద్యోగం. ఇది చాలా మంది భారతీయ విద్యార్థుల కల. అయితే అమెరికాలో నెలకొన్న ఆందోళనకర పరిస్థితులతో లక్షలాది మంది విద్యార్థుల కల చెదురుతున్నది. కొవిడ్ తర్వాత పరిస్థితులు చాలా మారిపోయాయని, గత కొన్ని సంవత్సరాలుగా టెక్ రంగం జాబ్ మార్కెట్‌లో మందగమనం నెలకొనగా, అదేవిధంగా కాలేజీ ట్యూషన్ ఫీజులు విపరీతంగా పెరుగడంతో ఇప్పటికే చాలా మంది అమెరికా చదువంటే వెనకడుగు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉన్నత విద్య కోసం అమెరికా రావడంపై పునరాలోచన చేయాలని భారతీయ విద్యార్థులకు అమెరికాలోని భారతీయ సీనియర్లు సూచనలు చేస్తున్నారు. మరీ ముఖ్యంగా అమెరికా కల నెరవేర్చుకునేందుకు రుణాలు చేసి మరీ మాస్టర్ డిగ్రీ పొందాలనుకుంటున్న విద్యార్థులు ఓ సారి పునరాలోచన చేయాలని అంటున్నారు. ఈ మేరకు పలువురు పెడుతున్న పోస్టులు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.



జాబ్ మార్కెట్‌కు చిల్లు.. అమెరికా కలకు చెల్లు!

అమెరికాలోని భారతీయులు ఎం చెప్తున్నారు?

- విద్యార్థుల అమెరికా కలకు సంబంధించి స్వర్ణ యుగం ముగిసింది.
- ఉన్నత విద్య ఎంచుకొనే సమయంలో పరిస్థితులపై ఆలోచనా వేసుకోవాలి.
- నిరుద్యోగం, తక్కువ వేతనాలు మరో రెండు మూడేండ్లు కొనసాగొచ్చు.
- అమెరికాలో మాస్టర్స్ కోసం అప్పులు చేసి మరీ రావొద్దు

ఆందోళనకు కారణాలు

- జాబ్ మార్కెట్‌లో మందగమనం
- భారీగా పెరిగిన ట్యూషన్ ఫీజులు
- ఉద్యోగం వచ్చినా తక్కువ వేతనం
- హెచ్-1బీ లాటరీలో అస్థిరత

మారుతున్న ట్రెండ్స్

- ప్రపంచవ్యాప్తంగా లేఆఫ్ ట్రెండ్‌తో సంప్రదాయ రంగాల వైపు విద్యార్థుల చూపు
- మైనింగ్, సివిల్, రోబోటిక్స్, మెకాట్రోనిక్స్ రంగాలపై పెరిగిన ఆసక్తి
- మైనింగ్, సివిల్ ఇంజినీరింగ్ విద్యలో పెరుగుతున్న విద్యార్థుల ప్రవేశాలు

దీర్ఘకాల దృష్టితో విద్యార్థులు

- టెక్ రంగంలో ఇబ్బందులతో సంప్రదాయ కోర్సుల్లో స్థిరత్వం కోరుకుంటున్న విద్యార్థులు
- ప్రపంచవ్యాప్తంగా కంపెనీల్లో కొనసాగుతున్న లేఆఫ్‌లతో కోర్సుల ఎంపికపై పునరాలోచన

స్వర్ణయుగం ముగిసింది!

'అమెరికాలో టెక్ ఉద్యోగాల స్వర్ణయుగం ముగిసింది. మీరు డిగ్రీ పట్టుకొని ఈ పరిస్థితుల్లో అమెరికా రావాలనుకొంటే సమయం, డబ్బు వృథా చేసుకోవడమే తప్ప ఏమీ ఉండదు. అధిక ఫీజులు, తక్కువ వేతనాలు, లాటరీలో హెచ్1బీ వీసా పొందే అవకాశం స్వల్పంగా ఉండటం.. గ్రీన్‌కార్డు పొందే అవకాశం లేకపోవడమే ఇందుకు కారణం' అని ఒకరు పోస్ట్ పెట్టారు. లక్షలాది మంది ఎంఎస్ కోసం అమెరికా వస్తున్నారని, కోర్సు పూర్తయిన తర్వాత అందరికీ ఉద్యోగాలు రావడం అనేది కలేనని మరొక నెటిజన్ ట్వీట్ చేశారు.

కాంగ్రెస్ వాళ్లు దేశద్రోహులు.. కాల్చిచంపేలా చట్టం చేయాలి!

బెంగళూరు: కర్ణాటక మాజీ మంత్రి, బీజేపీ సీనియర్ నేత కేఎస్ ఈశ్వరప్ప మరోసారి వివాదంలో చిక్కుకొన్నారు. పలువురు కాంగ్రెస్ నేతలను దేశద్రోహులుగా పేర్కొన్న ఆయన.. వారిని కాల్చిచంపేందుకు వీలు కల్పించే ఒక చట్టం చేయాలంటూ పిలుపునిచ్చారు. దావణగెరె జిల్లాలో జరిగిన పార్టీ సమావేశంలో ఈశ్వరప్ప మాట్లాడుతూ కాంగ్రెస్ ఎంపీ డీకే సురేశ్, ఎమ్మెల్యే వినయ్ కులకర్ణి దేశాన్ని ముక్కలు చేయాలని కోరుకుంటున్నారని, వారు దేశద్రోహులని విమర్శించారు. కాంగ్రెస్ నేతలు మరోసారి అలాంటి ప్రకటనలు చేసేందుకు ప్రయత్నిస్తే, ఈ విషయాన్ని తాను ప్రధాని మోదీ దృష్టికి దగ్గరకు తీసుకెళ్లి వారిని కాల్చిచంపేలా చట్టం చేయాలని కోరుతారన్నారు.

'బైడెన్.. జ్ఞాపకశక్తి లేని వృద్ధుడు!'

వాషింగ్టన్, ఫిబ్రవరి 9: ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు బైడెన్ కొన్ని దేశ రహస్య పత్రాలను 2017 వరకు 'ఉద్దేశపూర్వకంగా' తన ఇంట్లో అట్టిపెట్టుకోవడంతో పాటు ఆ పత్రాల్లోని సమాచారాన్ని ఇతరులతో పంచుకున్నట్టు స్పెషల్ కౌన్సెల్ రాబర్ట్ హుర్ తన సంచలన నివేదికలో స్పష్టం చేశారు. అంతేకాకుండా 'జ్ఞాపకశక్తి తక్కువగా ఉన్న వృద్ధుడు'గా బైడెన్‌ను అభివర్ణించారు. వయసు రీత్యా వచ్చే సమస్యల వల్ల బైడెన్ (81) జ్ఞాపకశక్తిలో అనేక లోపాలను గుర్తించినట్టు వెల్లడించారు. కాగా, హుర్ నివేదికను బైడెన్ తీవ్రంగా ఖండించారు. తన జ్ఞాపకశక్తిలో ఎలాంటి లోపాలు లేవని, ఎలాంటి రహస్య సమాచారాన్నీ తాను ఇతరులతో పంచుకోలేదని చెప్పారు.

అమెరికా అధ్యక్ష పీఠంపై మహిళనే: నిక్కీ హేలి

వాషింగ్టన్, ఫిబ్రవరి 9: ఈ ఏడాది అమెరికాకు ఒక మహిళ అధ్యక్షురాలు అవుతారని రిపబ్లికన్ పార్టీ తరపున అధ్యక్ష అభ్యర్థిత్వానికి పోటీలో ఉన్న నిక్కీ హేలి వ్యాఖ్యానించారు. 'అధ్యక్ష పీఠంపై కూర్చొనేది నేను లేదా కమలా హారిస్..' అని ఓ మీడియా సంస్థతో మాట్లాడుతూ అన్నారు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వం కోసం ట్రంప్‌తో పోటీపడుతున్న వారిలో నిక్కీ హేలి మాత్రమే నిలిచారు. నెవాడా, యూఎస్ వర్జిన్ ఐలాండ్స్ ప్రైమరీ ఎన్నికల్లో గురువారం దక్కిన విజయంతో ట్రంప్ రేసులో దూసుకుపోతున్నారు. అయినప్పటికీ, తన పోరాటం కొనసాగుతుందని, వైట్‌హౌస్ రేసులో ఉంటానని హేలి పేర్కొన్నారు.

యావజ్జీవం అంటే జీవితాంతం శిక్షనా?

ఖైదీ పిటిషన్‌పై విచారణకు సుప్రీంకోర్టు అంగీకారం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: యావజ్జీవ శిక్షకు సరైన నిర్వచనం కోరుతూ దాఖలైన పిటిషన్ పరిశీలనకు సుప్రీంకోర్టు అంగీకరించింది. యావజ్జీవం అంటే జీవితాంతం శిక్షనా? లేక సీఆర్పీసీ సెక్షన్ 432 కింద దాన్ని తగ్గించడం కానీ, రద్దు చేయడం కానీ చేయవచ్చా? అనే దానిపై స్పష్టత కోరుతూ చంద్రకాంత్ ఝా అనే వ్యక్తి పిటిషన్ వేశారు. 2006, 2007లలో తీహార్ జైలు బయట మూడు తలలేని మొండెంల కేసులో చంద్రకాంత్ ఝా యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్నాడు. చంద్రకాంత్ పిటిషన్‌పై స్పందన కోరుతూ జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ధర్మాసనం ఢిల్లీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. న్యాయవాది రిషి మల్హోత్రా ద్వారా దాఖలు చేసిన తన పిటిషన్‌లో ఐపీసీ సెక్షన్లు 302, 201 కింద తనకు శిక్ష విధించారని తెలిపారు. తనకు ట్రయల్ కోర్టు విధించిన మరణశిక్షను ఢిల్లీ హైకోర్టు గతంలో యావజ్జీవ కారాగార శిక్షగా మార్చిందని పేర్కొన్నారు. ఐపీసీలోని సెక్షన్ 302 రెండు శిక్షలను స్పష్టంగా పేర్కొన్నదని, ఒకటి మరణశిక్ష, రెండోది యావజ్జీవ కారాగార శిక్ష అని తెలిపారు. ఈ రెండు మినహా మరే ఇతర శిక్షను ఇందులో పేర్కొనలేదని తన పిటిషన్‌లో ఝా తెలిపారు. యావజ్జీవ కారాగార శిక్షను జీవితాంతం వరకు అని పరిగణించినట్లయితే.. అది దోషిగా ఆ వ్యక్తి ప్రాథమిక హక్కును ఉల్లంఘించినట్టు అవుతుందని పిటిషన్ పేర్కొన్నది.

18 నుంచి భారత్‌లో ప్రపంచ సుందరి పోటీలు

న్యూఢిల్లీ: ప్రపంచ సుందరి(మిస్ వరల్డ్) 71వ ఎడిషన్ పోటీలు భారత్‌లో ఈ నెల 18 నుంచి మార్చి 9 వరకు జరగనున్నాయి. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత భారత్‌లో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు శుక్రవారం ప్రకటించారు. న్యూఢిల్లీలో ప్రారంభ వేడుకతో పోటీలు ప్రారంభమై మార్చి 9 ముంబైలో ముగస్తాయి. న్యూఢిల్లీలోని భారత్ మండపం సహా వివిధ వేదికల్లో పోటీ జరుగుతుంది. వివిధ దేశాలకు చెందిన 120 మంది అందెగత్తెలు వివిధ పోటీల్లో, దాతృత్వ కార్యక్రమాల్లో పాల్గొంటారు. 'ఇండియా పట్ల నాకున్న ప్రేమ దాచలేనిది. ఈ దేశంలో ప్రపంచ సుందరి పోటీ జరగడం నాకెంతో సంతోషాన్ని కలిగిస్తున్నది' అని మిస్ వరల్డ్ సంస్థ సీఈవో, అధ్యక్షురాలు జులియా మోర్లే అని అన్నారు.

పాకిస్థాన్‌లో హంగ్?

- ఏ పార్టీకి సంపూర్ణ మెజార్టీ ఇవ్వని ఓటర్లు
- సత్తా చాటిన ఇమ్రాన్‌ఖాన్ మద్దతున్న ఇండిపెండెంట్లు
- అత్యధిక స్థానాలు కైవసం
- మెజార్టీ లేకున్నా తమదే విజయమంటూ నవాజ్ ప్రకటన

ఇస్లామాబాద్: హంగ్ ప్రభుత్వం దిశగా పాకిస్థాన్ అడుగులేస్తున్నది. గురువారం జరిగిన పాకిస్థాన్ జాతీయ అసెంబ్లీ ఎన్నికల్లో మ్యాజిక్ ఫిగర్‌కు ఏ పార్టీ చేరుకోలేదు. దీంతో ఇక్కడ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడే అవకాశాలు కన్పిస్తున్నాయి. అయితే మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ మద్దతుతో గెలిచిన ఇండిపెండెంట్లు ఆధిక్యం ప్రదర్శిస్తున్నారు. దీంతో అధికారం కోసం మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ మిగతా పార్టీలు, ఇండిపెండెంట్ల మద్దతు కూడగట్టడానికి ప్రయత్నిస్తున్నారు. శుక్రవారం కడపటి వార్తలందేసరికి 224 జాతీయ అసెంబ్లీ సీట్ల ఎన్నికల ఫలితాలు వెలువడగా, అందులో ఇమ్రాన్ మద్దతు ఇండిపెండెంట్లు 92 మంది విజయం సాధించారు. మూడుసార్లు ప్రధానిగా చేసిన నవాజ్ షరీఫ్‌కు చెందిన పాకిస్థాన్ ముస్లిం లీగ్-నవాజ్ (పీఎంఎల్-ఎన్)కు 63, బిలావల్ భుట్టో జర్దారీకి చెందిన పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ)కి 50, మిగిలిన చిన్న పార్టీలు 19 సీట్లను గెల్చుకున్నాయి. పాకిస్థాన్ జాతీయ అసెంబ్లీలోని 336 స్థానాల్లో 265 స్థానాలకు (అభ్యర్థి మరణంతో ఒకటి వాయిదా పడింది) ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నికలు జరిగాయి. పాక్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి కనీసం 133 సీట్లు సాధించాలి. మరోవైపు, తమ పార్టీకి మెజార్టీ రాకపోయినప్పటికీ, తమదే విజయమంటూ నవాజ్ షరీఫ్ పేర్కొన్నారు. ఆర్థిక, రాజకీయ సంక్షోభంలో ఉన్న పాకిస్థాన్ పునర్నిర్మాణానికి విపక్ష పార్టీలు కలిసి రావాలని మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ పిలుపునిచ్చారు.

తేదీ మార్చకుండా రాజ్యాంగ పీఠికను సవరించొచ్చా? సుప్రీంకోర్టు ప్రశ్న

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: రాజ్యాంగాన్ని ఆమోదించిన 1949, నవంబర్ 26వ తేదీని మార్చకుండా రాజ్యాంగ పీఠికను సవరించొచ్చా అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. రాజ్యాంగ పీఠిక నుంచి సెక్యులర్, సోషలిస్ట్ పదాలను తొలగించాలని కోరుతూ మాజీ ఎంపీ సుబ్రమణ్యస్వామి, న్యాయవాది విష్ణుకుమార్ జైన్ దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు ఈ మేరకు స్పందించింది. అకడమిక్ పర్పస్ కోసం తేదీని మార్చకుండా పీఠికను సవరించొచ్చు అని, అందులో ఎలాంటి సమస్య ఉండదని జస్టిస్ దత్తా పేర్కొన్నారు. దీనిపై సుబ్రమణ్యస్వామి స్పందిస్తూ.. ఈ విషయంలో అదే అసలు ప్రశ్న అని అన్నారు. రాజ్యాంగ పీఠిక నిర్దిష్ట తేదీతో వస్తుంది కాబట్టి, చర్చ లేకుండా దానిని సవరించలేమని జైన్ పేర్కొన్నారు. తదుపరి విచారణను కోర్టు ఏప్రిల్ 29కి వాయిదా వేసింది.

హల్ద్వానీ హింసాకాండలో ఆరుగురి మృతి

హల్ద్వానీ: ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో హైకోర్టు అక్రమ కట్టడంగా నిర్ధారించిన మదర్సా కూల్చివేత సందర్భంగా చెలరేగిన హింస కొనసాగింది. గురువారం రాత్రి బన్‌బూల్‌పుర పోలీస్ స్టేషన్‌కు ఆందోళనకారులు నిప్పు పెట్టారు. హింసాకాండలో ఆరుగురు చనిపోగా, వందకు పైగా పోలీసులు గాయపడ్డారు. అల్లరి మూకలు ప్రణాళిక ప్రకారం ఘర్షణలు సృష్టించాయని శుక్రవారం అధికారులు తెలిపారు. ఉద్రిక్తతల నేపథ్యంలో రాష్ట్రంతో పాటు పక్కనే ఉన్న ఉత్తరప్రదేశ్‌లోనూ హై అలర్ట్ ఆదేశాలు జారీ చేశారు. వాహనాలను నిశితంగా తనిఖీ చేస్తున్నారు. నైనిటాల్ జిల్లాలో స్కూళ్లు, కాలేజీలు, ఇంటర్నెట్ సేవలను నిలిపేశారు. సోషల్ మీడియా కార్యకలాపాలను అధికారులు పరిశీలిస్తున్నారు. సీసీటీవీ ద్వారా నిందితులను గుర్తించామని, వారు ఠాణాలోని పోలీసులను కాల్చేందుకు ప్రయత్నించారని నైనిటాల్ జిల్లా మెజిస్ట్రేట్ వందనా తెలిపారు.

రైతు నేస్తం ఈ మరయంత్రం

రాజస్థాన్ యువకుడి అద్భుత సృష్టి • అగ్రి రోబోను తయారు చేసిన ఆర్యన్

నేల, పంట ఆరోగ్యం, నీటి అవసరాలు, చీడపీడలను గుర్తించే సామర్థ్యం

తాను రూపొందించిన రోబోతో ఆర్యన్ సింగ్

కోటా, ఫిబ్రవరి 9: రాజస్థాన్‌లోని కోటాకు చెందిన 17 ఏళ్ల ఆర్యన్ సింగ్ అనే విద్యార్థి రైతులకు సహాయకారి అయిన రోబోను కనిపెట్టాడు. నేల స్వభావంతో పాటు పంటకు ఎంత నీరు అవసరమవుతుందో కూడా ఈ రోబో కచ్చితంగా అంచనా వేయగలదు. తెగుళ్లను గుర్తించగలదు. అది ఇది అని కాదు.. ఒక రైతుకు పంట పండించటంలో అవసరమైన పలు రకాల సేవలను ఈ ఒక్క రోబో అందిస్తుంది. తన పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో అగ్రి రోబోను తయారు చేశాడు. ఇందుకోసం నాలుగేండ్లు శ్రమించాడు. పదవ తరగతి చదువుతున్నప్పుడు మల్టీ టాస్క్ పరికరాన్ని డెవలప్ చేయాలని ఆలోచించానని ఆర్యన్ తెలిపాడు. తాను రైతు కుటుంబం నుంచి వచ్చానని.. రైతుల కష్టాలు తనకు తెలుసని తెలిపాడు. ఈ అగ్రి రోబో కటింగ్, నీటిపారుదల, లోడింగ్, భూసార పరీక్ష తదితర అనేక పనులను సింగిల్ హ్యాండెడ్‌గా చేయగలదని ఆర్యన్ పేర్కొన్నాడు. ఈ ఇన్నోవేషన్‌కు గాను ఆర్యన్ ఇప్పటికే 15 జాతీయ అవార్డులు అందుకున్నాడు. ఈ ప్రొటోటైప్ రోబోను తయారు చేయటానికి తనకు 50 వేల ఖర్చు అయ్యిందని, వీటిని పెద్ద సంఖ్యలో కనుక ఉత్పత్తి చేస్తే ఖర్చు తగ్గుతుందని ఆర్యన్ తెలిపాడు. తాను రూపొందించిన ఈ అగ్రి రోబో సంవత్సరంలోగా మార్కెట్లోకి వస్తుందని ఆర్యన్ ఆశాభావం వ్యక్తం చేశాడు.

ఎన్నో ఉపయోగాలు..

నేల, పంట ఆరోగ్యం, పంటకు నీటి అవసరాలు, చీడపీడలు గుర్తించడంలో ఈ రోబో ఎంతో ఉపయోగపడుతుంది. పంట పరిస్థితి విశ్లేషించటానికి ఈ అగ్రి రోబోకు కెమెరాలు అమర్చారు. రోబో పై భాగంలో ఓ డ్రాపర్ కూడా ఉన్నది. ఇది పొలంలో విత్తనాలు, నీటిని చల్లటానికి సహాయం చేస్తుంది. దీని వల్ల రైతుకు ఎంతో శ్రమ తగ్గుతుంది. రోబోలో మట్టి తేమ సెన్సార్లు కూడా అమర్చబడి ఉన్నాయి. ఇవి భూమి స్వభావాన్ని అంచనా వేసి, ఏవైనా తెగుళ్లు ఉన్నాయా అన్నది తెలియచేస్తుంది. ఈ రోబో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ని ఉపయోగిస్తుంది. దీన్ని రిమోట్‌తో కూడా ఆపరేట్ చేయవచ్చు. మీరు వేరే ప్రాంతంలో ఉన్నా సరే.. మీ పొలంలో రోబోను ఉపయోగించవచ్చని ఆర్యన్ తెలిపారు. అంతేకాదు..ఈ రోబో సౌర శక్తితో కూడా నడుస్తుంది.

నిపుణ

విద్య, ఉద్యోగ సమాచారం

ఎంఎస్ఎంఈలో...

హైదరాబాద్‌లోని ఎంఎస్ఎంఈ-టూల్ రూమ్‌లో కాంట్రాక్టు ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 14
- **పోస్టులు:** ఫ్యాకల్టీ, అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్, ఇన్‌స్ట్రక్టర్
- **విభాగాలు:** ఈఈ, టూల్ డిజైన్ అండ్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్
- **ఎంపిక:** వాక్ ఇన్ ఇంటర్వ్యూ ద్వారా
- **ఇంటర్వ్యూ తేదీలు:** ఫిబ్రవరి 17 – మార్చి 16 మధ్య నిర్వహిస్తారు.
- **వెబ్‌సైట్:** www.citdindia.org

ఎన్ఐఆర్‌డీపీఆర్‌లో ప్రవేశాలు

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ (ఎన్ఐఆర్‌డీపీఆర్) దూర విద్యా విధానంలో అందించే కింది కోర్సుల్లో ప్రవేశాల కోసం ప్రకటన విడుదలైంది.

- **కోర్సులు:** పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లొమాలు
- **స్పెషలైజేషన్లు:** సస్టెయినబుల్ రూరల్ డెవలప్‌మెంట్, ట్రైబల్ డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్, జియోస్పేషియల్ టెక్నాలజీ అప్లికేషన్స్ ఇన్ రూరల్ మేనేజ్‌మెంట్, పంచాయతీరాజ్ గవర్నెన్స్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్
- **దర